


పన్నులు.. 49.46%



"అభివృద్ధి పనులు.. ఉద్యోగుల జీతాలు.. కార్యాలయ నిర్వహణకు నిధులు కావాలి. మున్సిపాలిటీల్లో ఆయా నిధులకు పన్నులే ఆధారం. అయితే అలాంటి పన్నుల వసూళ్లపై మున్సిపాలిటీలు ప్రత్యేక దృష్టి సారించాలి. కానీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని కొన్ని మున్సిపాలిటీల్లో అధికారులు పన్నుల వసూళ్లపై కనీసంగా కూడా ప్రయత్నించడంలేదని డీఎంఏ కార్యాలయ గణాంకాలు తెలియజేస్తున్నాయి. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని అన్ని మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటి పన్ను రూ.283.26 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.140.12 కోట్లు పన్ను వసూలు చేశారు. పన్ను వసూలు 49.46 శాతానికే పరిమితమైందంటే అధికారుల పనితీరు అర్థం చేసుకోవచ్చు. ఆదాయ వనరులను పెంపొందించుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఈ వసూళ్లను చూస్తే తెలుస్తోంది. మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటిపన్ను బకాయిలు పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మున్సిపాలిటీలకు ఇచ్చిన లక్ష్యాల మేర పన్ను వసూలు జరగడం లేదు. సిబ్బంది అలసత్వంతో వసూలు మందకొడిగా సాగుతోంది. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నా మున్సిపాల్టీల్లోని అధికారులు సరైన రీతిలో స్పందించడంలేదని బకాయిలను చూస్తే తెలుస్తోంది. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నాయే కాని వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదు. అవినీతి, రాజకీయ ఒత్తిళ్లతో పన్నుల వసూళ్లలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి."

- వసూళ్లు అంతంత మాత్రమే
- మున్సిపాల్టీల్లో భారీగా బకాయిలు
- లక్ష్యాల మేర వసూళ్లలో అధికారులు విఫలం
- లక్ష్యం రూ.283.26 కోట్లు.. వసూలు రూ.140.12 కోట్లు
- టాప్ టెన్‌లో వినుకొండ, దాచేపల్లి, మంగళగిరి, చీరాల
- ఈ నెలాఖరుకు నూరు శాతం వసూలు చేయాలని ఆదేశాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు.. పన్నులు. ఇలాంటి పన్నుల వసూళ్లలో మున్సిపాలిటీలు వెనుకబడిపోతున్నాయి. పన్నుల వసూళ్లలో కనీస ప్రయత్నం కూడా ఉండటం లేదని ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులను చూస్తే తెలుస్తోంది. ఇక లక్ష్యాల మేర పన్నుల వసూళ్లు జరగకపోతుండ టంతో ఆ ప్రభావం ఉద్యోగుల జీతాలు, అభివృద్ధి పనులపై పడుతోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలి టీల్లో పన్ను వసూలు అంతంతమాత్రంగానే ఉంది. ప్రగతి పనుల నిర్వాహణకు ప్రధాన వనరుగా ఉన్న పన్ను వసూళ్లలో మున్సిపా లిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆస్తి, నీటి పన్ను వసూలు మొక్కుబడిగా సాగుతోంది. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో కొన్ని మున్సిపాలిటీలు చతికిల పడుతున్నాయి. రాష్ట్ర స్థాయిలో వినుకొండ, దాచేపల్లి, తాడేపల్లి.. మంగళగిరి, చీరాల పురపాలక సంఘాలు మొదటి పదిస్థానాల్లో ఉన్నాయి. ఆస్తి పన్ను రూ.229 కోట్లకు రూ.128.89 కోట్లు వసూలు కాగా అది 56.28 శాతంగా ఉంది. నీటి పన్ను రూ.54.26 కోట్లు వసూలు లక్ష్యం కాగా ఇప్పటికి రూ.11.26 కోట్లు వసూలు కాగా అది 20.75 శాతంగా ఉంది. ఈ నెలాఖరు కల్లా నూరు శాతం పన్ను వసూలు చేయాలని మున్సిపాల్టీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇచ్చిన లక్ష్యాలను వినుకొండ, దాచేపల్లి పురపాలక సంఘాలు మినహా గుంటూరు కార్పొరేషన్‌తో పాటు ఏ ఒక్క పురపాలక సంఘం చేరుకోలేదు. చిలకలూరిపేట మున్సిపాల్టీ, గుంటూరు కార్పొరేషన్ పన్ను వసూళ్లలో వెనుకబడి ఉన్నాయి. చిలకలూరిపేట మున్సిపాల్టీలో పన్నుల వసూళ్లు 36శాతం లోపే ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో 46 శాతం మాత్రమే వసూలు చేశారు. ఉన్నతాధికారులు పన్ను వసూళ్లపై సమీక్షిస్తున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. ఈ నెలాఖరులోగా నూరు శాతం పన్ను వసూలు చేయాల్సి ఉండగా ఆ పరిస్థితులు లేవనే చెప్పాలి. వచ్చే నెల 1 నుంచి పన్ను కొత్త డిమాండ్ రానున్నది.



జిల్లాలో మొదటి, చివరి స్థానాలు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో కొన్ని పన్ను వసూళ్లలో 50 శాతం దాటాయి. నూరుశాతం మించి పన్నులు వసూలు చేసి పల్నాడు జిల్లాలోని వినుకొండ మున్సిపాలిటీ 141.50 శాతంతో రాష్ట్రంలో మొదటి పది స్థానాల్లో నిలిచింది. ఇక చిలకలూరిపేట మున్సిపాలిటీ 35.10 శాతం మాత్రమే వసూలు చేసి ఉమ్మడి గుంటూరు జిలాల్లోనే చివరి స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా విషయానికి వస్తే మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీ 92.64 శాతం పన్నుల వసూలుతో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండగా గుంటూరు నగర పాలక సంస్థ 45.70 శాతంతో చివరి స్థానంలో ఉంది. ఒక బాపట్ల జిల్లాలో 92.10 శాతం పన్నుల వసూళ్లతో చీరాల, అద్దంకి మున్సిపాలిటీలు ప్రథమ స్థానంలో ఉండగా జిల్లా కేంద్రమైన బాపట్ల 54.90 శాతంతో చివరి స్థానంలో ఉంది.

డిఫాల్టర్లలో ప్రభుత్వ కార్యాలయాలు

కేంద్ర, రాష్ట్ర కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు మూడు జిల్లాల్లో రూ.కోట్లలో పేరుకుపోయాయి. డిఫాల్టర్లు జాబితాలో ఆయా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయంటే ఆశ్చ ర్యం కాదు. మొండి బకాయిల్లో 70 శాతం వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన బకాయిలు ఉన్నాయి. గుంటూరు కార్పొరేషన్ సహా అన్ని పురపాలక సంఘాల్లో 300 వరకు డిఫాల్టర్లను గుర్తించారు. పల్నాడు జిల్లాలో రూ.14.82కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.5.30 కోట్లు, గుంటూరు కార్పొరేషన్‌లో రూ.55.74కోట్లు డిఫాల్టర్ల నుంచి పన్ను వసూలు చేయాల్సి ఉంది.


గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం

జీతాలు చెల్లింపుల్లో జాప్యం

మున్సిపాలిటీల్లో నిధుల లేమితో అభివృద్ధి పనుల నిర్వహణ, కార్మికుల, ఉద్యోగుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది. సకాలంలో పన్ను వసూలు కాకపోవడం వల్లే కొన్ని పురపాలక సంఘాల్లో ఈ పరిస్థితి నెలకుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండడంతో అవి నిలిచి పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఆస్తి పన్ను వసూళ్లు (రూ.కోట్లలో)

మునిసిపాలిటీ	లక్ష్యం	వసూలు	శాతం
గుంటూరు జిల్లా :			
గుంటూరు కార్పొరేషన్	145.54	66.53	45.70
తెనాలి	13.42	9.92	73.90
మంగళగిరి, తాడేపల్లి	18.62	17.25	92.64
పొన్నూరు	3.06	2.19	71.60
పల్నాడు జిల్లా :			
నరసరావుపేట	8.93	5.24	58.70
చిలకలూరిపేట	8.53	3.00	35.10
వినుకొండ	2.57	3.64	141.50
సత్తెనపల్లి	3.86	2.04	52.90
మాచర్ల	2.99	1.73	58.00
పిడుగురాళ్ల	2.86	2.54	88.90
దాచేపల్లి	1.07	0.99	92.20
గురజాల	0.78	0.50	64.60
బాపట్ల జిల్లా :			
బాపట్ల	5.24	2.88	54.90
రేపల్లె	2.86	2.44	85.30
చీరాల	6.20	5.72	92.10
అద్దంకి	2.47	2.28	92.10



కార్యదర్శుల.. పంచాయితీ

- గ్రేడ్ 5 పేరుతో అశాస్త్రీయ విభజన
- జీవో 85 ప్రకారం ఉన్నవి గ్రేడ్ 1, 2, 3, 4
- 1020 మంది పంచాయతీ కార్యదర్శులకు ఇబ్బందులు
- సచివాలయ సెక్రటరీల కోసం వైసీపీ ప్రభుత్వ వింత వాదన
- గ్రేడ్ 5 ఆధారంగా జరిపే బదిలీలను ఆపాలని డిమాండ్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 26: సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిన వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు పంచాయతీ కార్యదర్శులకు ప్రస్తుతం తలనొప్పిగా మారాయి. పంచాయతీ వ్యవస్థకు సమాంతరంగా తీసుకువచ్చిన సచివాలయాల వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సచివాలయ కార్యదర్శి మనుగడ కోసం పాత ప్రభుత్వం గ్రేడ్ 5 పంచాయతీలు అంటూ తెచ్చిన విభజన కొత్త వివాదాన్ని సృష్టిస్తోంది. జీవో నెంబరు 85 ప్రకారం 2019 వరకు కేవలం గ్రేడ్ 1, 2, 3, 4 పంచాయతీలు మాత్రమే ఉన్నాయి. పంచాయతీల ఆదాయం ఆధారంగా వాటిని విభజించారు. రూ.5 లక్షలు పైబడి ఆదాయం వచ్చే పంచాయతీలను గ్రేడ్ 1 అని, రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు ఆదాయం వచ్చే వాటిని గ్రేడ్ 2 అని, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చే వాటిని గ్రేడ్ 3 అని, రూ.లక్ష లోపు ఆదాయం వచ్చే పంచాయతీలను గ్రేడ్ 4 అని విభజించారు. గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి గా నియమించే వారికి సర్వీసును పరిగణనలోకి తీసుకుని అనుభవజ్ఞులకు అవకాశం ఇస్తారు. దానివల్ల గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేయించే వీలు ఉంటుంది. పంచాయతీ నిధులకు కూడా వారే పూర్తి జవాబుదారులు కావడం వల్ల అక్రమాలకు చాలా వరకు అవకాశం ఉండదు. ఈ పద్ధతిలో ఉన్న పంచాయతీ వ్యవస్థకు సచివాలయం ఉప్పెనలా పరిణమించింది.

అనుభవం లేని వారి చేతుల్లోకి..

గత వైసీపీ ప్రభుత్వం సచివాలయంలో కార్యదర్శి పేరుతో ప్రత్యేకంగా ఓ పోస్టును భర్తీ చేసింది. పంచాయతీ కార్యదర్శికి, సచివాలయ కార్యదర్శికి పెద్దగా సారూప్యత ఉండదు. చట్ట ప్రకారం విధులు కూడా వేర్వేరుగా నిర్దేశించబడ్డాయి. అయినా జగన్ ప్రభుత్వం సచివాలయ కార్యదర్శిని, పంచాయతీ కార్యదర్శితో సమానంగా ఎంచుతూ వచ్చింది. ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్‌కు విరుద్ధంగా గ్రేడ్ 5ని తెరపైకి తెచ్చింది. పంచాయతీలను కూడా అదే రీతిలో విభజిస్తూ వచ్చారు. విభజనకు ప్రాతిపదిక ఆదాయమా, జనాభా అన్న దానిపై స్పష్టత లేకుండానే ముందుకు వెళ్లారు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1020 గ్రామ పంచాయతీల్లో ఎక్కువ ఆదాయం ఉన్న పంచాయతీలు కూడా గ్రేడ్ 5లోకి వెళ్లాయి. ఉదాహరణకు ప్రత్తిపాడు మండలంలోని ఈదులపాలెం పంచాయతీ ఆదాయం రూ.34 లక్షలు. దాన్ని కూడా గ్రేడ్ 5 లోకి మార్చారు. ఇప్పుడు అంత ఆదాయం వచ్చే ఆ పంచాయతీని బొత్తిగా అనుభవం లేని సచివాలయ కార్యదర్శి చేతిలో పెట్టటం జరుగుతుంది. అసలు ఆదాయం లేని కొన్ని పంచాయతీలను గ్రేడ్ 1, 2, 3లలో చేర్చారు. ఉదాహరణకు ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామ పంచాయతీ ఆదాయం రూ.8 లక్షలు మాత్రమే. దానిని గ్రేడ్ 1 పంచాయతీగా నిర్ధారించారు. అనుభవం ఉన్న పంచాయతీ కార్యదర్శి ఆదాయం తక్కువ ఉన్న చోట, ఏ మాత్రం అనుభవం లేని సచివాలయ కార్యదర్శి ఆదాయం ఎక్కువగా ఉన్న చోట పని చేయాల్సి వస్తుంది.

విభజనపై పంచాయతీ కార్యదర్శుల నిరసన

చట్టంలో లేని గ్రేడ్ 5 పంచాయతీ విభజనపై నిరసన వ్యక్తమవుతోంది. సచివాలయ కార్యదర్శిని పంచాయతీ కార్యదర్శిగా నియమించడంపై వివాదం చెలరేగుతుంది. వారిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీలను అశాస్త్రీయం గా విభజించారని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. దానివల్ల తమకు అన్ని విధాల అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. గ్రేడ్ 5 పంచాయతీ జాబితా ఆధారంగా జరిపే బదిలీ ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీరాజ్ మంత్రి, కమిషనర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లామని చెబుతున్నారు.


నాబార్డు ఏర్పాటుచేసిన హస్త కళా వస్తువుల ప్రదర్శనను ప్రారంభించి పరిశీలిస్తున్న జేసీ భార్గవతేజ, నాబార్డు, వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు

చేనేత, హస్తకళలకు ప్రోత్సాహం

- హస్త కళా ఉత్సవంలో జేసీ భార్గవతేజ

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలు, స్వయం సహాయకసంఘాల ద్వారా తయారుచేసిన వివిధ ఉత్పత్తుల అమ్మకం ద్వారా కార్మికుల జీవన స్థితిగతులు మెరుగుపడతాయని, అందువల్ల వాటిని ప్రోత్సహిస్తున్నట్లు జేసీ భార్గవ్‌తేజ తెలిపారు. స్థానిక అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో నాబార్డు ఏర్పాటు చేసిన హస్తకళా ఉత్సవంలో వస్త్రప్రదర్శనను గురువారం ప్రారంభించారు. స్టాల్స్‌లో ఏర్పాటుచేసిన హస్త కళావస్తువులు, చేనేత వస్త్రాలను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నాబార్డు ఆధ్వర్యంలో ఉత్పత్తిదారులచే అమ్మకాలకు హస్త కళా ఉత్సవం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్ మాట్లాడుతూ నాబార్డు ఏర్పాటుచేసిన హస్తకళా ఉత్సవం అక్టోబరు 2 వరకు కొనసాగుతుందన్నారు. ఈ ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శనలో ధర్మవరం, వెంకటగిరి, ఫణిదం, పుత్తూరు, చీరాల, ఉప్పాడ, కడప, చీమకుర్తి, కోనసీమ, ఐలాపురం, పుంగనూరు, మాధవరం, అనకాపల్లి, మదనపల్లి, ఉదయగిరి, నెల్లూరు, విశాఖపట్నం, మంగళగిరి, పోచంపల్లి, ఆరుంబాక నుంచి 39 స్టాల్స్, తెలంగాణ, తమిళనాడు నుంచి మూడు చొప్పున, ఒడిస్సా నుంచి ఒక స్టాల్ ఏర్పాటు చేసి, చేనేత వస్త్రాలను తక్కువ ధరకే అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం కృష్ణకుమార్ బీ ప్రభు, యూబీఐ డీజీఎం ఐఎస్ జవహర్, నాబార్డ్ డీజీఎం శరత్, చైతన్య గోదావరి గ్రామీణబ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, చేనేత సొసైటీల ప్రతినిధులు, చేనేత, హస్త కళాకారులు పాల్గొన్నారు.

మరో ఇద్దరు సీఐల సస్పెన్షన్

- వైసీపీ హయాంలో చెలరేగిన సీఐ రాంబాబు
- దంపతుల విషయంలో అతిగా స్పందించిన సీఐ బిలాలుద్దీన్
- ఆయనతో వెళ్లి చేతులు కాల్చుకున్న మరో ఇద్దరు కానిస్టేబుళ్లు



గుంటూరు, సెప్టెంబరు 26: మరో ఇద్దరు సీఐలపై వేటుపడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారం చెలరేగిన ఖాకీలు తాజాగా మూల్యం చెల్లించుకుంటున్నారు. గతంలో పొన్నూరు రూరల్‌లో పని చేసి ప్రస్తుతం సత్తెనపల్లి రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎం రాంబాబు, డీసీఆర్బీ సీఐ బిలాలుద్దీన్‌తోపాటు డీసీఆర్బీ కానిస్టేబుళ్లు షేక్ చాంద్‌బాషా, షేక్ నూరుల్లాలను సస్పెండ్ చేస్తూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గాడితప్పిన ఖాకీలపై పోలీసు ఉన్నతాధికారులు గడిచిన రెండు, మూడు నెలలుగా కొరడా ఝుళిపిస్తున్నారు. పట్టాభిపురం సీఐ విజయ్‌చంద్ర, తెనాలి టూ టౌన్ సీఐ సుధాకర్‌లపై ఇప్పటికే వేటు పడింది. తాజాగా ఆ జాబితాలో మరో ఇద్దరు చేరారు. వైసీపీ హయాంలో పొన్నూరు రూరల్ సర్కిల్ పరిధిలో ఓ యువకుడు తనను ప్రేమపేరుతో మోసం చేశాడని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ కేసులో సీఐ రాంబాబు జోక్యం చేసుకుని యువతిని మోసం చేసిన యువకుడ్ని వదిలేశాడు. దీంతో బాధితురాలు స్టేషన్ వద్ద గొడవతో ఈ వ్యవహారం వివాదాస్పదమవడంతో గత్యంతరం లేక సీఐ నిందితుడ్ని తిరిగి అరెస్టు చేశారు. చేబ్రోలు పరిధిలోని క్వారీల యజమానులు, లారీ యజమానుల నుంచి, నారాకోడూరు పరిధిలోని హోటళ్ల నుంచి సీఐ పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. వీటిపై అప్పట్లోనే డీఎస్పీ స్థాయి అధికారి విచారణ జరిపి ఐజీకి నివేదిక పంపగా దాని ఆధారంగా రాంబాబుపై వేటు పడింది.

భర్తను కిడ్నాప్ చేసిన సీఐ, కానిస్టేబుల్

మనస్పర్థలతో భర్తతో విడిపోయిన ఓ మహిళ గుంటూరు హౌసింగ్ బోర్డు సమీపంలోని పుట్టింటికి వచ్చింది. అయితే భర్త అక్కడికి వచ్చి భార్యతో గొడవ పడుతున్నట్లు, అత్తమామలు తమకు బంధువైన డీసీఆర్బీ సీఐ బిలాలుద్దీన్‌కు ఫోన్ చేసి చెప్పారు. స్థానిక నల్లపాడు పోలీసులకు తెలియజేసి వారి ద్వారా చర్యలు తీసుకోవాల్సి ఉండగా, అందుకు భిన్నంగా తన వాహనంలో డీసీఆర్బీ కానిస్టేబుళ్లతో సంఘటనా స్థలానికి వెళ్లి భర్తను తన వాహనంలో ఎక్కిం చుకుని బెదిరించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద వదిలేశారు. ఇందుకు సంబంధిం చిన వీడియోలతో బాధితుడు నేరుగా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ సతీష్‌కుమార్ విచారణకు ఆదేశించగా విచారణలో బాధితుడి ఆరోపణలు వాస్తవమే నని తేలాయి. సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు చట్ట విరు ద్ధంగా వ్యవహరించారని తేలడంతో వారు ముగ్గురు ని సస్పెండ్ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

తగ్గించేదిలేదు

- మెట్టు దిగని వంటనూనెల వ్యాపారులు
- అధికారులు ఆదేశించినా ఎమ్మార్పీ ఆధారంగా దోపిడీ
- చర్యలు తీసుకోలేకపోతున్న రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలు

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'వంటనూనెల దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం పెంచిన దిగుమతి సుంకం గతంలో దిగుమతి చేసుకున్న నూనెలకు వర్తించదు. అయినా వ్యాపారులు నూనెల ధరలు అమాంతం పెంచేశారు. పాత స్టాకుపై కూడా ధరలు పెంచి విక్రయించడం నేరం. స్టాక్ ఉండి కూడా లేనట్లుగా కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటాం..' అని అధికారులు వంట నూనెల వ్యాపారులను హెచ్చరించారు. అయితే అధికారుల ఆదేశాలను జిల్లాలోని వంట నూనెల వ్యాపారులు పెడచెవిన పెడుతున్నారు. అటు వ్యాపారులు, ఇటు మాల్స్, సూపర్‌మార్కెట్ల నిర్వాహకులు వంట నూనె ధరల విషయంలో ఒక్క మెట్టు కూడా దిగలేదు. ఒక్కో ఆయిల్ ప్యాకెట్‌పై రూ.20 పెంచిన ధరనే వినియోగదారుల వద్ద వసూలు చేస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే ఎమ్మార్పీ కంటే తక్కువగా ఇస్తున్నామని సమాధానాలు చెబుతున్నారు. అంతేకాకుండా చాలా బ్రాండ్స్ ఆయిల్స్‌ని దాచేసి రెండు, మూడు రకాల ప్యాకెట్లను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు.

వ్యాపారుల సిండికేట్..

ముడి చమురుపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచిందే తడవుగా ఈ నెల 14 నుంచి వంట నూనెలు విక్రయించే వ్యాపారులు సిండికేట్ అయిపోయారు. ఒకపక్క కేంద్రం కొత్తగా దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ పైనే ఈ పెంచిన సుంకం అమలు చేయాలని చెబుతున్నప్పటికీ పాత స్టాకుపై ఇక్కడి వ్యాపారులు అమలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. అప్పటివరకు బ్రాండ్‌ని బట్టి రూ.100 నుంచి రూ.110 మధ్య ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ ప్యాకెట్‌ని రూ.120 నుంచి రూ.130కి పెంచేశారు. అలానే రైస్‌బ్రాన్ ఆయిల్‌ని రూ.130 చేశారు. పామాయిల్, సోయాబీన్ ఆయిల్స్‌ని కూడా లీటర్‌కి రూ.20 చొప్పున పెంచారు. వంటనూనె నిత్యావసర సరుకు కావడంతో గత్యంతం లేని పరిస్థితుల్లో పెంచిన ధరలను చెల్లించి వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. ధరల పెంపుపై జిల్లా అధికారులు ఇటీవల ఆయిల్స్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి పాత స్టాకుపై రేటు పెంచడానికి వీల్లేదని సూచించారు. పాత ధరలకే విక్రయించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో ఇందుకు ఏ ఒక్క వ్యాపారి ముందుకు రాలేదు. నేటికీ పెంచిన ధరలనే అమలు చేస్తున్నారు. వంటనూనె ప్యాకెట్లపై విపరీతమైన ఎమ్మార్పీ ఉంటుంది. గతంలో రూ.100కి విక్రయించిన ప్యాకెట్‌పై ఎమ్మార్పీ రూ.160 వరకు ఉంటుంది. ఇప్పుడు దానిని సొమ్ము చేసుకుంటూ ఇంకా మేము ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తున్నామని వ్యాపారులు బుకాయిస్తున్నారు. ఈ ఎమ్మార్పీ మాయాజాలాన్ని అటు తూనికలు, కొలతలు, ఇటు రెవెన్యూ అధికారులు అరికట్టలేకపోతున్నారు.



నెల రోజులు కాచిగూడ, నడికుడి రైళ్ల రద్దు

6లో..

జలవనరుల శాఖలో బదిలీలు

- ఎస్ఈగా రమేష్ కల్లూరి
- విజయవాడ సీఈ కార్యాలయానికి ఉమామహేశ్వరరావు బదిలీ

గుంటూరు ఆర్డీవో శ్రీకర్ బదిలీ

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి పీ శ్రీకర్‌ని కోనసీమ జిల్లా కొత్తపేట ఆర్డీవోగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకర్ స్థానంలో ప్రస్తుతం విజయవాడ హెడ్‌ఆఫీసులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో విధులు నిర్వహిస్తున్న కే శ్రీనివాసరావును నియమించారు. శ్రీనివాసరావు గతంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో గుంటూరులో విధులు నిర్వహించారు.

సీఎం సహాయనిధికి రూ.2 లక్షల విరాళం


సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కును అందజేస్తున్న మారెళ్ళ రామకృష్ణ, రమణ

యడ్లపాడు, సెప్టెంబరు 26 : యడ్లపాడు మండలం లింగారావు పాలెం గ్రామానికి చెందిన సోదరులు మారెళ్ళ రామకృష్ణ, మారెళ్ళ రమణలు ఏపీ సీఎం సహాయనిధికి రూ.2 లక్షలు విరాళాన్ని అందించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో గురువారం సోదరులు చంద్రబాబును కలసి చెక్కును అందజేశారు. చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపు మేరకు వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాన్ని అందించినట్లు సోదరులు పేర్కొన్నారు.

రాజధాని నిర్మాణానికి రూ.2 లక్షలు


ముఖ్యమంత్రికి విరాళం చెక్కును అందిస్తున్న సత్యనారాయణ, నగరాజకుమారి

తెనాలిరూరల్, సెప్టెంబరు 26: రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి గానూ సీఎం సహాయనిధికి రూ.2లక్షల విరాళాన్ని అందించారు. పెదరావూరుకి చెందిన రైతు గిరజపేలు సత్యనారాయణ, నగరాజ కుమారిలు గురువారం సీఎం చంద్రబాబునాయుడిని కలిసి తమ వంతు విరాళపు చెక్కును అందజేశారు. విరాళం అందజేసిన వారిని చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా అభినందించారు.


పిల్లి మాణిక్యరావు, దామచర్ల సత్యలను సత్కరిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

కష్టపడి పని చేసే వారికి టీడీపీలో గుర్తింపు: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, సెప్టెం బరు 26 : కష్టపడి పని చేసే వారికి తెలుగు దేశం పార్టీలో ఎప్పుడు మంచి గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి, చిలక లూరిపేట ఎమ్మెల్యే ప్రత్తి పాటి పుల్లారావు అన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం భర్తీ చేసిన నామినేటెడ్ పదవులే ఇందుకు నిదర్శనం అని అన్నారు. లెదర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పిల్లి మాణిక్యరావు, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్‌గా ఎంపికైన దామచర్ల సత్యనారాయణ గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరని శాలువాతో సత్క రించి వారికి ప్రత్తిపాటి అభినందనలు తెలిపారు. పదవులు రానివారు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే మరిన్ని నామినేటెడ్ పోస్టుల భర్తీ ఉంటుందని సీఎం చెప్పిన విషయాన్ని ప్రత్తిపాటి గుర్తుచేశారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రత్తిపాటి తల్లి చిన నారాయ ణమ్మ చిత్రపటం వద్ద మాణిక్యరావు, సత్య నారాయణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉద్యమించాలి

- 1,2,3 తేదీలలో రిలే నిరాహార దీక్షలు
- ప్రజా, కార్మిక సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం దశల వారి ఆందోళనలు నిర్వహిస్తున్నట్టు ప్రజా, కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. విశాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో ఏఐటీయూసీసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షణలో భాగంగా అక్టోబరు 1,2,3 తేదీలలో జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఏఐటీయూసీసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వరుసగా ఆకిటి అరుణ్ కుమార్, దండా లక్ష్మీనారాయణ ,ఏఐటియూసి రాష్ట్ర గౌరవాధ్య క్షుడు వెలుగూరి రాధా కృష్ణ మూర్తి, నల్లమడ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లా రాజ మోహన్, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి కే.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షోభాన్ని సవాల్‌గా స్వీకరించిన సీఎం

- పది రోజుల్లోనే బాధితులకు పరిహారం
- విజన్ 2047 దిశగా ముందడుగులు
- ఎమ్మెల్యే ఆనందబాబు


అనంతవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 26 : సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రమిస్తున్నారని, విపత్తునకు కుంగిపోకుండా అధికారులను అప్రమత్తం చేసి వరద సహాయక చర్యల్లో స్వయంగా పాల్గొన్న ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని అనంతవరంలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించి ప్రజలకు కరపత్రాలు అందించి ప్రభుత్వ పని తీరు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదికపై ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఐదేళ్ల సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి రాష్ట్రానికి రూ.11 లక్షల కోట్లు అప్పులు మిగిల్చారన్నారు. సంక్షోభాన్ని అధిగమించి సంక్షేమ, అభివృద్ధిని 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. వర్షాలు, వరదలు వచ్చినా కుంగిపోకుండా అధికారులను అప్రమత్తం చేసి విపత్తు సమర్థవంతంగా ముఖ్యమంత్రి ఎదుర్కొన్నారన్నారు. వరద పరిస్థితులను పది రోజుల్లోనే చక్కదిద్దడంతో పాటు మరో పది రోజుల్లోనే బాధితులందరికి పరిహారాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. భవిష్యత్ తరాల యువతను దృష్టిలో పెట్టుకుని విజన్-2047 దిశగా ముందుకు అడుగులు వేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారధ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తుందని చెప్పారు. జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీనివాసరావు ఎమ్మె ల్యేను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి వై.పిచ్చిరెడ్డి, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, మండల టీడీపీ అధ్యక్షులు షైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కే.మధుసూదనప్రసాద్, టీడీపీ రాష్ట్రకార్యదర్శి టీ. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలని అపవిత్రం చేసిన వైసీపీ

టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు ధారూ నాయక్

గుంటూరు, సెప్టెంబరు 26 : పవిత్రమైన తిరుమలని వైసీపీ అపవిత్రం చేసిందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం.ధారూ నాయక్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ పెద్దలు తిరుమలను ఒక పుణ్యక్షేత్రంగా కాకుండా సొంత సామ్రాజ్యంలా భావించారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో లడ్డూపై అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయని, అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దలకు గానీ, టీటీడీ పాలక మండలికి గానీ, జగన్‌కు ఆత్మబంధువైన అప్పటి ఈఓ ధర్మారెడ్డికి గానీ అవేమీ చెవికెక్కలేదని విమర్శించారు. లడ్డూలు, ఇతర ప్రసాదాల తయారీలో వాడుతోంది కల్తీ నెయ్యి అని తెలిసి కూడా కొనుగోలు చేయడం దుర్మార్గం అన్నారు. సాక్షాత్తు గోవిందుడికే ఘోర అపచారం తలపెట్టినవారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న జనసేన నేతల ప్రాయశ్చిత్త దీక్షలు

గుంటూరు, సెప్టెంబరు 26: తిరుమలలో లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు వినియోగించిన కారణంగా ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, నేతలు మామిడి రాము, ఉగ్గిరాల సీతారామయ్య, దాసరి రాము తదితరులు హౌసింగ్ బోర్డు కాలనీలోని సాయిబాబా గుడిలో గురువారం ప్రాయశ్చిత దీక్ష నిర్వహించారు. పార్టీ నాయకులతో పాటు వీరమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. గాదె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తిరుమల తిరుపతిని ఆదాయ వనరుగా మార్చుకొని ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించిందని విమర్శించారు. బోనబోయిన మాటాడుతూ పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి వైసీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు పీ.నరసింహరావు, డీ.వెంకటేశ్వరరావు, డీ.లక్ష్మీదుర్గ, వై. పద్మావతి, భూషయ్య, డీ.సీతారామయ్య, కే. వెంకటేశ్వరరావు, ఎం.కళ్యాణ్, ఎ.బుజ్జి, టీ.నాగేశ్వరరావు, న్యాయవాది మాధవరావు, శివం రఘు, కే.శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

అండర్ - 14, అండర్ - 17, అండర్ - 19

రగ్బీ, సెపక్ తక్రా బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక


రగ్బీకి ఎంపికైన అండర్-19 జిల్లా బాలబాలికల జట్టు

సత్తెనపల్లిరూరల్, సెప్టెంబరు 26 : మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని స్కూల్ గేమ్స్ అండర్ - 14, అండర్ - 17, అండర్ - 19 బాల బాలికల సెపక్ తక్రా, అండర్ - 19 రగ్బీ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. జట్ల ఎంపికలకు వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరైనట్టు అండర్ - 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి నరసింహారావు తెలిపారు.

ఎంపికల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డెంపూడి పవన్ కుమార్ హాజరయ్యారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు తమ జట్టు విజయమే ధ్యేయంగా రాణించాలని, క్రీడల ద్వారా జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు కొన్ని రోజుల్లో జరగబోయే 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి పద్మాకరరావు, హెచ్ఎం, పీఈటీలు పాల్గొన్నారు.

ఎంపికైన జట్ల వివరాలు..

అండర్ - 19 బాలుర రగ్బీ జిల్లా జట్టుకు పవన్ కుమార్, పీ.వవన కృష్ణ, ఈ.ప్రదీప్, జీ.మనోజ్‌కుమార్, ఎం.నాగరాజు, ఎస్‌కే జాస్వీర్, పీ.సాయి గణేష్, కే.దుర్గాప్రసాదు, కే.భాను, షేక్ రియాజ్, షేక్ మహమ్మద్ రియాజ్, ఫణీంద్ర, పీ.శ్రీకాంత్, ఎన్.రవితేజ. అండర్ - 19 బాలికల రగ్బీ జిల్లా జట్టుకు రోజ్‌మేరీ, శ్రీలక్ష్మి, ప్రవల్లిక, పుష్పలత, కోమలి, అలేఖ్య, జన్న ఫర్వీన్, నాగమణి, సౌమ్య, త్రివేని, దేవి, సల్మ, కే.ప్రవల్లిక, బీ.అఖిల, జీ.సుచరిత. అండర్ - 14 బాలుర జిల్లా సెపక్ తక్రా జట్టుకు ఎం.మనోహర్, ఆర్.సంతోష్ కుమార్, టీ.మనోహర్‌బాబు, షేక్ మహమ్మద్ తౌఫిక్, బీ.కార్తీక్. అండర్ - 14 బాలికల సెపక్ తక్రా జిల్లా జట్టుకు పీ.గాయత్రి, కే.గీతిక, డీ.అక్షయ, ఎం.హర్షిణి, బీ.ప్రగతి, అండర్ - 17 బాలుర సెపక్ తక్రా జిల్లా జట్టుకు పీ.శౌరి కిరణ్, పీ.గోపీచంద్, బీ.అనిల్‌కుమార్, ఎం.ప్రభుదాసు, ఎం.లోకేశ్ ఎంపికయ్యారు. అండర్ - 17 బాలికల సెపక్ తక్రా జిల్లా జట్టుకు ఎం.నాగలక్ష్మి, ఏ.మానస, కే.కీర్తన, బీ.మోక్షసాధని, బీ.సాత్విక. అండర్ - 19 బాలుర సెపక్ తక్రా జిల్లా జట్టుకు కే.శ్రీనాథ్, జీ.హర్ష, వై.ప్రభుదాసు, కే.విజయ చోళుడు, బీ.నాని ఎంపికయ్యారు. అండర్ - 19 బాలికల సెపక్ తక్రా జిల్లా జట్టుకు పీ.యామిని, కే.బ్లెస్సీ, బీ.మౌనిక, వీ.భావనశ్రీ కుమారి, ఓ.దీవెన ఎంపికయ్యారు.

జలవనరుల శాఖలో బదిలీలు

- ఎస్ఈగా రమేష్ కల్లూరి
- విజయవాడ సీఈ కార్యాలయానికి ఉమామహేశ్వర రావు బదిలీ

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో ఎస్ఈ, ఈఈ స్థాయి అధికారుల బదిలీలు జరిగాయి. ఇరిగేషన్ సర్కిల్ గుంటూరు డివిజన్ ఉన్నతాధికారిగా రమేష్ కల్లూరిని ప్రభుత్వం నియమించింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఆయన ప్రస్తుతం పాడేరు ఇరిగేషన్ సర్కిల్ ఎంఎఐ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కాగా, గుంటూరుకు చెందిన ఉమామహేశ్వరరావుని విజయవాడ ఎస్ఈ హైడ్రాలజీ కార్యాలయంలో ఈఈ-1గా పోస్టింగ్ చేసింది. రేపల్లె డ్రైనేజీ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పులిపాటి వెంకటరత్నంని కేడబ్ల్యూడీ తెనాలికి బదిలీ చేసింది. సంకరపు మల్లికార్జునని తెనాలి కేడబ్ల్యూడీ డివిజన్ నుంచి శ్రీశైలం డ్యాంకి బదిలీ చేసింది. బూసం శ్యాం ప్రసాద్‌ని కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్ కార్యాలయం నుంచి గుంటూరు ఎస్ఈ కార్యాలయంలో గేజింగ్ డివిజన్‌కు పోస్టింగ్ చేసింది. చింతలపూడి ఎల్ఐఎస్ ప్రాజెక్టు డివిజన్‌లో ఉన్న వంగల శివరాంప్రసాద్‌ని పులిచింతల ప్రాజెక్టు డివిజన్-4కి బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీ.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు వెలువరించారు.

30న క్రీడాకారుల ఎంపిక

గుంటూరు(విద్య),సెప్టెంబరు 26 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జిల్లా ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి మెల్లెంపూడి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న అథ్లెటిక్స్ పోటీలు అండర్-14 ,అండర్-17 బాల బాలికలకు పెనుమాకలో జడ్పీ స్కూల్‌లో, రెజ్లింగ్ అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగం విద్యార్థులకు అచ్చంపేటలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ స్కూల్, నిర్వహిస్తామని తెలిపారు. 30న బాస్కెట్‌బాల్ అండర్-14, అండర్-17 (బాలికలకు) నరసరావుపేటలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠ శాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న కోకో అండర్ -14 బాలబాలికల ఎంపికలు కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని, ఇదేరోజున టైక్వాండో అండర్-14, అండర్-17 బాల బాలికలకు తెనాలిలోని జెఎస్ ఫిట్నెస్ సెంటర్‌లో ఎంపికలు జరుగుతాయని ,వివరాలకు 9963386100 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అక్టోబర్ 1న కరాటే పోటీలు బాలబాలికల అండర్-14, 17 విభాగాల ఎంపికలు కుంచనపల్లిలోని అరవింద హైస్కూల్‌లో జరుగుతాయని,వివరాలకు 95817 66907 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అండర్-14,17 విభాగాల్లో బాలబాలికల షూటింగ్ ఎంపికలు ఇండియన్ షూటింగ్ అకాడమీ గుంటూరు అమరావతి రోడ్డు(ఆలా ఆసుపత్రి ఎదురు) నిర్వహిస్తారని, వివరాలకు 9490639441 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

వీఐటీ గేటు ముందు ఏఐఎస్ఎఫ్ ధర్నా


ఏఐఎస్ఎఫ్ సభ్యులను అడ్డుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది

తుళ్లూరు, సెప్టెంబరు 26: వీఐటీ విశ్వవిద్యాలయంలో బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సాయి శ్రీయ (19) ఫ్యాన్‌కు ఉరేసుకొని ఈ నెల 17న సాయంత్రం 7 గంటల సమయంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో కళాశాల వీసీని మృతురాలు తల్లిదండ్రులతో మాట్లాడించాలని డిమాండ్ చేశారు. కళాశాల లోపలకు వెళ్లబోతుండగా వారిని సెక్యూరిటీ అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గేటు ముందు విద్యార్థి ఫెడరేషన్ ధర్నా నిర్వహించింది. ఆత్మహత్య వివరాలు తల్లిదండ్రులకు పూర్తిగా వివరించలేకపోవడం ఏంటని ప్రశ్నించారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పోలీసుల సమక్షంలో ఆత్మహత్యకు గల కారణాలు, సీసీ ఫుటేజీలను చూపించి వివరాలను ఆమె తల్లిదండ్రులకు నాలుగు గంటల పాటు తెలిపామని వీఐటీ యాజమాన్యం చెబుతోంది. విద్యార్థిని కట్టిన ఫీజు రుసుం కూడా వెనక్కి ఇస్తామని చెప్పామని, అకౌంట్ నంబరు ఇవ్వాలని అప్పుడే అడిగామని పేర్కొంది. ఈ ఘటన జరిగిన వారంరోజుల తర్వాత ఆందోళనకు దిగడం బాధాకరమని వీఐటీ యాజమాన్యం తెలిపింది.

రోడ్లు, భవనాల శాఖతో ఎస్ఆర్ఎం ఎంవోయూ


ఒప్పంద పత్రాలను చూపుతున్న ఎస్ఆర్ఎం, రోడ్లు, భవనాల శాఖ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 26: ఏపీ రోడ్లు, భవనాల శాఖకు సమగ్ర సహకారాన్ని అందిం చేందుకు ఎస్ఆర్ఎం యూని వర్సిటీ ముందుకు వచ్చింది. ప్రభు త్వం చేపట్టే నాణ్యమైన రోడ్ల నిర్మాణం, నూతన టెక్నాలజీ అభివృద్ధి కోసం వర్క్‌షాపుల నిర్వహణ వంటి అంశాల్లో అవసరమైన సహకారాన్ని ఇచ్చేందుకు వర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం అంగీకరించింది. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖతో గురువారం ఎం వోయూ కుదు ర్చుకుంది. ఆ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నయీముల్లా, స్టేట్ హైవేస్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని ఎంవోయూ పత్రాలపై సంత కాలను చేశారు. అనంతరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. వర్సిటీ తరఫున రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. మూడేళ్లపాటు ఇది అమలులో ఉంటుందని, ప్రభు త్వం తరఫున తొలి వర్క్‌షాపు అక్టోబరు 7న నిర్వహి స్తామని చీఫ్ ఇంజనీర్ పేర్కొన్నారు.

నెల పాటు కాచిగూడ, నడికుడి రైళ్ల రద్దు

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెయిన్‌టెనెన్స్ వర్కుల కారణంగా రెండు రైళ్లను నెల పాటు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07791 కాచిగూడ - నడికుడి, 07792 నడికుడి - కాచిగూడ రైళ్లను అక్టోబరు 1 నుంచి 31 వరకు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బదిలీలలో అక్రమాలు.. అధికారులపై చర్యలు తప్పవు

- జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా



గుంటూరు సిటీ, సెప్టెంబర్ 26 : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సిబ్బంది బదిలీలలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు.' జడ్పీ బదిలీలలో ఇష్టారాజ్యం'అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆమె గురువారం స్పందించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బదిలీలలో అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బది లీలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. దీర్ఘకాలం ఒకేచోట పనిచేస్తున్న వారిని నిబంధనలకు లోబడి బదిలీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్నామని వెల్లడించారు. కొందరు సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు తన దృష్టికి వచ్చిన విషయాలపై కూడా విచారణ జరుపుతామన్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై సీఎంఓకు, కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న శాంటో బెనర్జీ తదితరులు

సరికొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం

- పాలిటెక్నికో డిటోరినో డాక్టర్ శాంటో బెనర్జీ

గుంటూరు(విద్య),సెప్టెంబరు 26: నాన్ లీనియర్ అనాలిసస్‌తో ఆవిష్కరణలను,పరిశోధనలను వేగంగా తీసుకెళ్ళటంతో పాటు ఖచ్చితత్వం కలిగి సరికొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుందని ఇటలీలోని పాలిటెక్నికో డిటోరినో డాక్టర్ శాంటో బెనర్జీ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో మూడురోజుల పాటు నిర్వహించిన సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సావనీర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎన్ఐటి దుర్గాపూర్ ప్రొఫెసర్ సమర్జిత్‌కర్, ఐఐటి ధన్‌బాద్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు పెంట్యాల, విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ ఆచార్య పీ.నాగభూషన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డేగల ప్రభాకర్, పక్కన ఎమ్మెల్యే నసీర్

సంక్షోభంలోనూ సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం : డేగల

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సంక్షోభంలోనూ సంక్షేమం అందజేయడం చంద్రబాబుకే సాధ్యమని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం 3వ డివిజన్లో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. కూటమి సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 1000 పింఛను పెంచి లబ్ధిదారులకు అందించామన్నారు. సంక్షోభంలోనూ సంక్షేమం చంద్రబాబుకే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఈ వంద రోజుల పాలనలోనే పింఛనుదారులకు, నిరుద్యోగులకు మేలు చేయడంతో పాటు, అన్న క్యాంటీన్లను ప్రారంభించడం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం, ధాన్యం కొనుగోలు బకాయిలు చెల్లించటం, విజయవాడ వరద బాధితులను కన్న తండ్రిలా కాపాడటం వంటి పనుల ద్వారా ఇది మంచి ప్రభుత్వమని ప్రజలంతా చెప్పుకునేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేశారని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ ఎలావుల అశోక్, వెంకటకృష్ణ, డివిజన్ ప్రెసిడెంట్లు బట్ట రాజా, మాదాసు శేఖర్, అల్లం బాజీ, యిలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మూడు వారాల్లోనే ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

● రూ. 42.98 కోట్ల నగదు 23 వేల పైచిలుకు రైతుల ఖాతాలకు జమ

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తు సంభవించిన మూడు వారాల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీని టీడీపీ నేతృత్వ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం జమ చేసింది. గత నెల 31వ తేదీన కురిసిన భారీ వర్షాలతో కృష్ణానదికి వచ్చిన వరదతో పాటు స్థానికంగా ఉన్న వాగులు, కాలువల కట్టలు తెగిపోవడంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. వారం పైగా పంట పొలాలు వరద నీటిలోనే ఉన్నాయి. జిల్లాలో ప్రధానంగా 19,066 మంది రైతులకు చెందిన 12,607.59 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నది. వీరంతా చిన్న, సన్నకారు రైతులు. అలానే మరో 2,558 ఇతర రైతులకు చెందిన 3,119.74 హెక్టార్లలో వరి పంట నీట మునిగింది. వీరందరికి కలిపి ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.39.31 కోట్లను సీఎం చంద్రబాబు తన కార్యాలయం నుంచి విడుదల చేశారు. బ్యాంకర్లు గురువారం నుంచి రైతుల బ్యాంకు ఖాతాలకు నగదుని జమ చేయడం ప్రారంభించారు. ఇదేవిధంగా మినుము పంట వేసి నష్టపోయిన 298 మంది రైతులకు రూ.45.8 లక్షలు, పత్తి రైతులు 1906 మందికి రూ.3.06 కోట్లు, జొన్న, పెసర, వేరుశనగ, జూట్, చెరకు, కంది, సోయాబీన్ తదితర పంటలు వేసి నష్టపోయిన రైతులకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేశారు. మొత్తంగా 23,957 మంది రైతులకు రూ.42 కోట్ల 98 లక్షల నగదుని జమ చేసే ప్రక్రియని ప్రారంభించారు. మూడు, నాలుగు రోజుల వ్యవధిలో రైతులందరి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యుత్ అధికారులు ఇబ్బందులు పెడితే సీజీఆర్‌ఎఫ్‌ను సంప్రదించొచ్చు

● సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

గుంటూరు, సెప్టెంబరు 26: విద్యుత్ పరమైన సమస్యలను పరిష్కరించకుండా అధికారులు ఇబ్బందులు పెడితే పరిష్కారానికి వినియోగదారులు కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్)ను సంప్రదించవచ్చని ఛైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ సూచించారు. గుంటూరు-1 డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సంగడిగుంట విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సమావేశం జరిగింది. ఈ అదాలత్‌లో పలువురు విద్యుత్‌పరమైన సమస్యలను ఫోరం దృష్టికి తీసుకెళ్ళారు. అనంతరం ఛైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ మీడియాతో మాట్లాడుతూ అదాలత్‌కు 15 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. తన మూడేళ్ళ పదవీ కాలంలో మొత్తం 600 ఫిర్యాదులను పరిష్కరించినట్లు చెప్పారు. వినియోగదారులు విద్యుత్ సమస్యల పరిష్కారానికి గుణదల కేంద్రంగా వ్యవహరిస్తున్న సీజీఆర్‌ఎఫ్‌ను సంప్రదించవచ్చన్నారు. ముందుగా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్ళాలని, పరిష్కారం కాని పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఫిర్యాదులను మెయిల్, ఆన్‌లైన్ ద్వారానైనా ఫోరంనకు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు చేసే వారు తమ ఫోన్ నెంబరు, అడ్రస్‌తో పాటు పూర్తి సమాచారాన్ని పొందుపరచాలన్నారు. అలానే ఫోరంను 9491034319ను కూడా సంప్రదించవచ్చని కోరారు. వినియోగదారుల ఫిర్యాదులను 60 రోజులలో పరిష్కరిస్తామన్నారు. ఈనెల 24న కూడా సంతమాగులూరులో అదాలత్ నిర్వహించామన్నారు. సమావేశంలో ఫోరం సభ్యులు వెంకటకృష్ణ (టెక్నికల్), ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు (ఫైనాన్స్), స్వతంత్ర సభ్యులు ఏ.సునీతతో పాటు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్, గుంటూరు-1 ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, పలువురు డిప్యూటీ ఈఈ, ఏఈలు ఉన్నారు.

నేడు డీసీఎంఎస్ సర్వజన మహాసభ

గుంటూరు, సెప్టెంబరు 25: జిల్లా కోర్టు రోడ్డులో ఉన్న జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఏ భార్గవతేజ అధ్యక్షతన సర్వజన మహాసభ జరుగుతుందని సొసైటీ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ అధికారులు హాజరుకావాలని కోరారు.

మనిషి ఎప్పుడో చచ్చిపోయాడు...!



అనాథ శవం పక్కగా వెళుతున్న వాహనదారులు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 26 : కాకి చనిపోతే వంద కాకులు చుట్టూ చేరి అరచి ఘోషిస్తాయి. కోతి చనిపోతే వానర మూక ఒక్కచోట చేరి కన్నీరు కారుస్తుంది. వాటికి భాష లేదు.. మాటలు లేవు.. ఉన్నదొక్కటే ఐకమత్యం. మనకి (మనుషులకు) అన్నీ ఉన్నాయి. కానీ లేనిదదే. ఒకప్పుడు ఒక్కరు పోయారంటే ఏ బంధుత్వం లేకున్నా ఊరు ఏకమై కర్మకాండలు చేసిన మనిషి ఇప్పుడు ఏమయ్యాడో అర్థం కావటం లేదు. చుట్టూ జరుగుతున్న సంగతులు గమనిస్తూ ఉంటే మనలోని మానవత్వం ఏ గ్రహానికి వలస వెళ్లిందో అంతు పట్టటం లేదు. మొత్తం మీద మనలోని మనిషి ఎప్పుడో చచ్చిపోయాడని పిస్తుంది. ఇంత పెద్ద మాట ఎందుకంటే.. మనలో మానవరీతి స్పందనలు మాయమయ్యాయి. ఏదో ఎదిగాము అనుకుంటున్నాం కానీ ఎంత దిగజారామో అర్థం కావడం లేదు. కొన్ని కదిలించే సంఘటనలు కళ్ల ముందు అలా కదిలాడుతున్నప్పుడు కూడా మనిషి మనిషిగా స్పందించలేని దుస్థితి నేటి సమాజంలో మన ఎదుగుదల సూచీగా కనిపిస్తుంది. గుంటూరు నగరంలోని నల్ల చెరువు 9వ లైన్ వద్ద గురువారం కనబడిన దృశ్యం నేటి మా'నవ' సమాజానికి కళంకంగా మారింది. అతను ఎవరో.. ఏమిటో.. ఎవరికీ తెలియదు. మధ్యాహ్నం వరకు డివైడర్‌పై పడుకున్నాడు. తర్వాత రోడ్డు మీద పడిపోయి చనిపోయాడు. చెత్త ఏరుకునే వాళ్ళు దూరం నుంచి చూసి చెత్తేమో అనుకున్నారు. దగ్గరకు వచ్చి చూసి మనిషని వెళ్లిపోయారు. ఆ రోడ్డు గుండా వందలాది వాహనాలు వస్తున్నాయి.. పోతున్నాయి.. కానీ ఏ ఒక్కరూ ఆగలేదు.. అతను ఎందుకలా పడి ఉన్నాడని చూడలేదు. చనిపోయాడని తెలిసినా చివరకు ఆ చుట్టుపక్కల వాళ్ళు కూడా స్పందించలేదు. కనీసం మునిసిపాలిటీ వాళ్ళకి కూడా ఎవరూ సమాచారం ఇవ్వలేదు. అన్నీ తెలిసిన మనుషుల్లో ఒకరు పోతే సాటి మనిషి స్పందన తీరిది.

బహుళ అంతస్తులు నిబంధన ప్రకారమే నిర్మించాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



భవన నిర్మాణ కొలతలను పరిశీలిస్తున్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 26 : నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు నిర్దేశిత నిబంధనల మేరకు మాత్రమే చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసి) జారీ చేయబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ గురువారం శ్యామలా నగర్ మెయిన్ రోడ్‌లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్‌ల కొలతలను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు జరగాలని, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు తమ పరిధిలో అనధికార, ప్లాన్‌కి భిన్నంగా జరిగే నిర్మాణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం, ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ సిటి ప్లానర్ మురళి, టీపీఎస్ రిజ్వాన, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థుల భాగస్వామ్యం అభినందనీయం

స్వచ్ఛ గుంటూరు సాధనలో విద్యార్థుల భాగస్వామ్యం అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఐటిసి బంగారు భవిష్యత్ సహకారంతో నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులకు జరిగిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను కమిషనర్ గురువారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు గుంటూరు నగరంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డ్రాయింగ్ (కాలుష్య రహిత నగరం), వ్యాస రచన (కాలుష్య రహిత నగరం), నినాదాలు (పర్యావరణ పరిరక్షణ) అంశాలపై జరిగిన పోటీల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం ఆనందంగా ఉందని, విద్యా సంస్థల్లో కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కలిగించాలని కోరారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి, పోటీల నోడల్ అధికారి తిరుపతిరెడ్డి, ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రతినిధులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో మెగా పరిశుభ్రత కార్యక్రమాల నిర్వహణ

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హి సేవా 10వ వార్షికోత్సవం సందర్భంగా రైల్వేలో మెగా పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ నేతృత్వంలో రైల్వే అధికారులంతా కలిసి పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో గురువారం శ్రమదానం నిర్వహించారు. చెత్తాచెదారం ఎత్తి ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డుకు తరలించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. అనంతరం రైల్వేస్టేషన్లలో ఆహార పదార్థాలు విక్రయించే ప్రదేశాలను సందర్శించి ఆరోగ్యకరమైన విధానాలను అవలంబిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కే.సైమన్, సీపీఎం గతిశక్తి డీ.మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సీనియర్ డీఈఈ జీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మెగా పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌ఎం రామకృష్ణ

వైభవంగా గౌరి విశ్వేశ్వరస్వామి కల్యాణం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26 : స్థానిక బ్రాడీపేటలోని శ్రీ గౌరీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించి, దంపతులతో అర్చకస్వామి విశ్వేశ్వర శర్మ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్, మల్లికార్జునశర్మ, వాసు, చక్రపాణి పర్యవేక్షించారు

జాషువా సాహిత్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సాహిత్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ కే ఎస్ లక్ష్మణరావు కోరారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గురువారం జాషువా 129వ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ జాషువా తన జీవితాంతం, కుల వివక్ష, అంటరానితనం దళితులపై దాడులు, మూఢ నమ్మకాలు, విగ్రహారాధనకు వ్యతిరేకంగా తన సాహిత్యాన్ని రాసి ప్రజలకు అంకితమిచ్చారన్నారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ నేటి విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సామాజిక రుగ్మతులకు వ్యతిరేకంగా గళమెత్తాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కిరణ్, వై.కృష్ణకాంత్, సమీర్, ఎస్.పద్మ, ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో కే ఎస్ లక్ష్మణరావు, డాక్టర్ రమణ యశస్వి తదితరులు

భూ పోరాటానికి వీరమాత చిట్యాల ఐలమ్మ

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణ వీరవనిత చిట్యాల ఐలమ్మ తొలి భూ పోరాటానికి పునాది వేసిన వీరమాత అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు. అరండల్ పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఐలమ్మ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే మాధవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, మల్లె ఈశ్వరరావు, సింహాద్రి కనకాచారి, కంచర్ల శివరామయ్య, బొబ్బిలి రామారావు, మాదాల చినకొండలరావు, తుమ్మేటి మురళి, రాచకొండ లక్ష్మయ్య, జంపని నాగేశ్వరరావు, షేక్ చిన్నబాజి, లామ్ నవమి, మునగ గణపతి, మర్రిపాటి శ్రీనివాస్, లంకా మాధవి, మన్నవ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 129వ జయంతి గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. తొలుత చంద్రమౌళి నగర్ లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.



కోర్టు కేసులపై తహసీల్దార్‌లతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ భార్గవ్ తేజ

పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై జేసీ సమీక్ష

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 26 : గుంటూరు జిల్లాలో రెవెన్యూ డిపార్టుమెంట్‌కి సంబంధించి ఆయా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన ఈ సమీక్ష సమావేశంలో జిల్లాలోని తహసీల్దార్‌లు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు. 22(ఎ) జాబితాలో ఉన్న భూముల తొలగింపుపై సమావేశంలో చర్చ జరిగింది. అన్యాక్రాంతమైన రెవెన్యూ భూములు విషయంలో తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై కూడా జేసీ అధికారులతో మాట్లాడారు. కోర్టులో ఉన్న ప్రతి కేసులోనూ కౌంటర్ అఫిడవిట్లు వేయాలని అధికారులను ఆదేశించారు.

గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకారం



గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 26 : గుంటూరు ఎక్సైజ్ శాఖ నూతన డిప్యూటీ కమిషనర్‌గా డాక్టర్ కే.శ్రీనివాసులు గురువారం బాధ్యత స్వీకరించారు. గతంలో ఆయన ఇక్కడ ఏసీగా, ఏఈఎస్‌గా పనిచేశారు. నూతన డీసీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులుని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తుందన్నారు. క్రైం రేట్ తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు.

దేవదాయ శాఖ డీసీగా శ్రీనివాసరావు...



గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 26: గుంటూరు దేవదాయ ధర్మాదాయ శాఖ నూతన డిప్యూటీ కమిషనర్‌గా కేబీ శ్రీనివాస రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఉన్న మహేశ్వర్‌రెడ్డి హెడ్ ఆఫీస్ రిపోర్ట్ చేయమనగా, మాలకొండ నరసింహ స్వామి దేవస్థానం ఈవోగా ఉన్న శ్రీనివాస రావును గుంటూరు డీసీగా నియమించారు. నూతన డీసీని జిల్లా ఏసీ అనుపమ, ఇన్‌స్పెక్టర్లు, ఈవోలు, మేనేజర్లు ఘనంగా సత్కరించారు. ఆలయాల ఖ్యాతి పెంచేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

గుంటూరు ఎక్సైజ్ శాఖ ఈఎస్‌గా అరుణ కుమారి

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 26: గుంటూరు డివిజన్ ఎక్సైజ్ శాఖ ఈఎస్‌గా అరుణ కుమారి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో బాపట్ల ఈఎస్‌గా పనిచేస్తూ బదిలీల్లో గుంటూరు ఈఎస్ నియమించారు. దీంతో ఆమె గుంటూరు ఎక్సైజ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు

మూడు ఆలయాల్లో హుండీల లెక్కింపు పూర్తి

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 26: లాలాపేట గ్రూపు దేవాలయాల పరిధిలోని మూడు ఆలయాల్లో హుండీల లెక్కింపు పూర్తి చేసినట్లు గ్రూప్ దేవాలయం ఏసీ డి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. కొత్తపేట జగన్నాథ స్వామి దేవస్థానంలో రూ.8464 నగదు, నాజ్ సెంటర్ ఆంజనేయస్వామి దేవస్థానంలో రూ.3,01,469 నగదు, పాత బస్టాండ్ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రూ.4,25,559 నగదు చొప్పున మొత్తం మూడు దేవాలయాల మీద కలిపి మూడు నెలలకు రూ.7,35,492 ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం

గుంటూరు, సెప్టెంబరు 26 : బాలసుబ్రమణ్యం తెలుగువాడిగా పుట్టటం తెలుగువారు చేసుకున్న పూర్వ జన్మల సుకృతమని ప్రముఖ నాటక రచయిత బీవీ రామ్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం బాలసుబ్రమణ్యం వర్థంతి కార్యక్రమం జరిగింది. 16 భాషల్లో పాటలు పాడిన ఘనత, రోజుకు 21 పాటలను రికార్డు చేయగల సత్తా బాలుదన్నారు. తెలుగు భాష సౌందర్యం బాలసుబ్రమణ్యం గాత్రంలో పరవళ్ళు తొక్కుతుందన్నారు. ఆయన పాటలు తెలుగు వారి గుండెల్లో పదిలంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పి మొగిలి, చంద్రయ్య, కుమారి, మణి, రాజశేఖర్, మదుసూదనరావు తదితరులున్నారు.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు(విద్య),సెప్టెంబరు 26 : విద్యార్థులు చదువుకునే యూనివర్సిటీలో ప్రజాస్వామ్యం ఎక్కడ ఉంది అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయిశ్రీయ అనే విద్యార్థిని విట్ యూనివర్సిటీలో చదువుతూ కొన్ని రోజుల కిందట మృతి చెందింది. ఈ ఘటనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విట్ (అమరావతి) యూనివర్సిటీ యాజమాన్యం దీనికి బాధ్యత వహించి విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, సహాయక కార్యదర్శి యశ్వంత్ తదితరులు

కార్మికుల కూలీ రేట్లను పెంచాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26 : సివిల్ సప్లైస్ కార్మికుల కూలీ రేట్లను పెంపుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలు రెండో రోజుకు చేరుకున్నాయి. గురువారం స్థానిక సివిల్ సప్లైస్ గౌడౌన్ల వద్ద ముఠా కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోట్ల మరియదాసు మాట్లాడుతూ కార్మికుల కూలీ రేట్ల అగ్రిమెంట్ 9 నెలలు పూరైన, ఇంత వరకు కూలీరేట్లు పెంపుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన పరిష్కరించని నేపథ్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు రావుల అంజిబాబు, దానం కాంతారావు, వినుకొండ డేవిడ్, జాన్‌బాబు, సురేష్, మరియబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పరిశుభ్ర గుంటూరు కార్యక్రమంలో డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్న ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసరావు

పరిశుభ్ర పశ్చిమ గుంటూరే నా లక్ష్యం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన గుంటూరు పశ్చిమ నియోజకవర్గమే తన లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. 'మీతోనే- మీ వెంటే' అనే వినూత్న కార్యక్రమంతో ఆమె నియోజకవర్గ ప్రజల్లోకి వెళుతున్నారు. తొలిరోజు 49వ డివిజన్ వేలంగిణి నగర్ కొండయ్య కాలనీలో 'పశ్చిమ గుంటూరు - పరిశుభ్ర గుంటూరు అనే నినాదంతో డివిజన్‌లో పారిశుధ్య చర్యలు చేపట్టారు. డ్రైనేజీల్లో సిల్ట్, వీధుల్లో చెత్త తొలగింపు వంటి పారిశుధ్య కార్యక్రమానికి నగర మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాస్ తో కలిసి ఈ కార్యక్రమానికి నాంది పలికారు. డివిజన్లోని పారిశుధ్య కార్మికులతోపాటు, అదనంగా మరో 50 మంది పారిశుధ్య కార్మికులను వినియోగించి ఆ ప్రాంతాన్ని యుద్ధప్రాతిపదికను శుభ్రం చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ దేశాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా తయారు చేయాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి మోడీ 'స్వచ్ఛభారత్ మిషన్' కార్యక్రమాన్ని చేపట్టారని, ఇందులో భాగంగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. పరిశుభ్ర పశ్చిమ గుంటూరు లక్ష్యాన్ని అక్టోబర్ 2 గాంధీ జయంతి లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ లక్ష్యసాధన కోసం ఎమ్మెల్యే గళ్లా మాధవి 'మీతోనే- మీ వెంటే' అనే కార్యక్రమంతో డివిజన్ మొత్తం పరిశుభ్రంగా ఉంచడానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టటం అభినందనీయమన్నారు. ఇది అనేకమందిలో స్ఫూర్తిని నింపుతుంది అని తాను భావిస్తున్నానని తెలిపారు.

● గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 49 డివిజన్ భారత్‌పేటలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి డివిజన్లో పర్యటిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

శాంతి, సామరస్యాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిది

● డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

గుంటూరు(విద్య), సెప్టెంబరు 26 : శాంతి, సంస్కృతిని ప్రతి ఒక్కరి మనసులో నింపుకున్నప్పుడే జీవితం ప్రశాంతంగా కొనసాగుతుందని ఆర్వీఆర్అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల కోడ్ ఆఫ్ కండక్ట్, ఎథిక్స్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'శాంతియుత మార్గం' అనే అంశం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వత్రా శాంతియుత భావాలను బలోపేతం చేయడానికి అన్ని దేశాల ప్రతినిధులు అనేక కార్యక్రమాల ద్వారా శాంతి చర్చలు, ఇతర పరస్పర ఒప్పందాలతో తమ ఐకమత్యాన్ని చాటుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని, కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

ప్రైవేటు వాహనాల రవాణాపై ఆర్టీసీ డిపో మేనేజర్ స్పెషల్ డ్రైవ్

గుంటూరు, సెప్టెంబరు 26: మార్కెట్ సెంటర్‌లోని పల్నాడు బస్టాండ్ వద్ద ప్రైవేటు వాహనాల రవాణాపై గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పల్నాడు బస్టాండ్ వద్ద డిఎం అబ్దుల్ సలాం, అసిస్టెంట్ మేనేజర్ జి సాంబశివ, ట్రాఫిక్ సూపర్‌వైజర్లతో కలిసి ప్రైవేటు వాహనాలైన ఆటోలు, క్యాబ్‌లు, టాక్సీల్లో ప్రయాణీకులను తరలించటంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బస్సుల నిలుపు స్థానాల్లో ప్రైవేటు వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ అందిస్తోన్న వివిధ రకాల పాస్‌లతో పాటు సేవలను, టిక్కెట్ కోసం డిజిటల్ చెల్లింపుల వంటి వివరాలను మైకు ద్వారా అవగాహన కల్పించారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం క్షేమం కాదని, ఆర్టీసీ బస్సులను ఆదరించాలని కోరారు.

రేలంగి నరసింహారావుకు అక్కినేని ఆత్మీయ పురస్కారం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గురువారం హైదరాబాద్ కళా విపంచి బొప్పన నరసింహారావు, గుంటూరు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు ఆత్మీయ పురస్కార సభ జరిగింది. హాస్య సినీ దర్శకుడు రేలంగి నరసింహారావుకు అక్కినేని ఆత్మీయ పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ మిర్చి యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు వజ్జా మధుసూధనరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



రేలంగి నరసింహారావును సత్కరిస్తున్న నన్నపనేని రాజకుమారి, ఏఎస్ రామకృష్ణ తదితరులు

నవ్య | చిత్రజ్యోతి
గుంటూరు • శుక్రవారం 27 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com

ఆ సన్నివేశాలు తొలగిస్తే ఓకే

• హైకోర్టుకు తెలిపిన సెన్సార్ బోర్డు



తాము సూచించిన సన్నివేశాలకు కత్తెర వేస్తే 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ బోర్డు బాంబే హైకోర్టుకు తెలిపింది. కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో పలుమార్లు విడుదల వాయిదా పడింది. దీంతో ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించగా, సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో ఈ నెల 25లోగా ఓ నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు గురువారం విచారణకు రాగా, కొన్ని సన్నివేశాల్లో కట్స్‌ను సూచించిన సెన్సార్‌బోర్డ్ అందుకు అంగీకరిస్తే సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని కోర్టుకు నివేదించింది. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి చిత్రబృందం సమయం కోరింది. దీంతో కోర్టు తదుపరి విచారణను ఈ నెల 30కు వాయిదా వేసింది. ఆ లోగా ఓ నిర్ణయానికి రావాలని నిర్మాణసంస్థను ఆదేశించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం, ఎమర్జెన్సీ నాటి సంఘటనల నేపథ్యంలో 'ఎమర్జెన్సీ' తెరకెక్కింది. కంగన ఇందిరాగాంధీ పాత్రను పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

జస్ట్ ఆస్కింగ్.. అంటూ ట్వీట్ల మీద ట్వీట్లు



విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. వివిధ అంశాలపై స్పందిస్తూ 'జస్ట్ ఆస్కింగ్' అంటూ ప్రశ్నలు సంధిస్తుంటారు. తిరుమల లడ్డు వివాదంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ప్రకాశ్‌రాజ్‌కు మధ్య మూడు రోజుల క్రితం మొదలైన ట్వీట్ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రకాశ్‌రాజ్ పోస్టులపై పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేయడమే కాకుండా సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని మీడియా సమావేశంలో హెచ్చరించడంతో ఈ ట్వీట్ల అటాక్ మొదలైంది. 'నేను విదేశాల్లో ఉన్నా.. ఇండియా వచ్చిన తర్వాత మీ ప్రశ్నలకు సమాధానం చెబుతా' అని ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. అంతటితో ఈ వ్యవహారం ముగిసిందని అందరూ భావించారు. కానీ ప్రకాశ్‌రాజ్ ఊరుకోలేదు. తమిళ హీరో కార్తీ లడ్డు వ్యవహారంపై క్షమాపణ చెప్పడాన్ని ప్రస్తావిస్తూ 'చేయని తప్పునకు క్షమాపణలు చెప్పించుకోవడంలో ఆనందం ఏమిటో.. జస్ట్ ఆస్కింగ్' అంటూనే వ్యంగ్య బాణం వదిలారు. అయితే ఈ ట్వీట్‌పై పవన్‌కల్యాణ్ స్పందించలేదు. ఆయన మౌనంగా ఉన్నా ఊరుకోకుండా గురువారం మరో ట్వీట్ బాణం వదిలారు ప్రకాశ్‌రాజ్. గెలిచే ముందు ఒక అవతారం.. గెలిచాక మరో అవతారం .. ఏమిటీ అవాంతరం.. ఎందుకీ అయోమయం.. ఏది నిజం.. జస్ట్ ఆస్కింగ్ అంటూ తనదైన శైలిలో ప్రశ్నించారు. ప్రకాశ్‌రాజ్ పెట్టిన ఈ ట్వీట్ పై నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు.



ఉత్సవంలా సాగే పాట

శంకర్

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. కియారా అద్వాణీ కథానాయిక. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి రెండో గీతాన్ని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్, సంగీత దర్శకుడు తమన్ ఈ పాట చిత్రీకరణకు సంబంధించిన విశేషాలను పంచుకున్నారు. శంకర్ మాట్లాడుతూ 'ఈ పాట చిత్రీకరణ కోసం చాలా పరిశోధన చేశాం. దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన నృత్యరీతులను పాటలో భాగం చేశాం. ఒక ఉత్సవంలా ఈ పాట సాగుతుంది. రామ్‌చరణ్ అద్భుతంగా నర్తించారు' అని చెప్పారు. తమన్ మాట్లాడుతూ "రా మచ్చా.. పాటలో విభిన్న సంస్కృతులను చూపించబోతున్నాం. పాటను తెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.



టాలీవుడ్ అగ్ర దర్శకులు రాజమౌళి, సుకుమార్ అనూహ్య కలయిక అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్టూడియోలో 'పుష్ప2' చిత్రీకరణ జరుగుతోంది. మహేశ్‌బాబుతో తాను చేయబోయే సినిమా పనుల కోసం రాజమౌళి కూడా అదే స్టూడియోకు వెళ్లారు. అక్కడ వారిద్దరు కలుసుకున్నారు.

ఆకట్టుకునే అలియా పోరాటం



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాలా దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించారు. అలియాభట్ సోదరుడి పాత్రలో వేదాంగ్ రైనా నటించాడు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. చిత్రబృందం గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. హంతక ముఠాల నుంచి తమ్ముణ్ణి కాపాడుకునేందుకు అక్క చేసిన పోరాటం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. యాక్షన్ సన్నివేశాల్లో అలియా నటన ఆకట్టుకుంది.

మనసుకి హత్తుకొనే తల్లి కథ



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఆశీస్సులతో ఆయన తనయుడు కిశోర్ చిత్రనిర్మాణరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న 'తల్లి మనసు' చిత్ర షూటింగ్ పార్ట్ పూర్తయింది. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన తారాగణం. ఈ సినిమాతో వి.శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల కిశోర్ మాట్లాడుతూ 'సినిమా ప్రారంభోత్సవం నాడు సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని చెప్పినట్టే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా షూటింగ్ చేసి వర్క్ పూర్తి చేశాం. మంచి కథ, కథనాలు సినిమాకు ప్రధాన బలం. అందుకు తగ్గ ఆర్టిస్టులు దొరికారు. వారందరి సహకారంతో మనసు కట్టి పడేసే అద్భుత చిత్రంగా రూపుదిద్దుకుంది. నాన్నగారి పర్యవేక్షణలో దర్శకుడు చక్కగా సినిమా తీశారు. తొలి ప్రయత్నంలోనే ఒక మంచి సినిమా తీసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. వాస్తవిక జీవితానికి అద్దం పట్టే విధంగా 'తల్లి మనసు' ఉంటుందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని ముత్యాల సుబ్బయ్య చెప్పారు.



యాభై సెకన్ల యాడ్‌కు రూ. ఐదు కోట్లా!?

కాలం కలసి రావాలే కానీ సినిమా తారలకు ఇప్పుడు రెండు చేతులా సంపాదనే!. అయితే సినిమా షూటింగ్ లేకపోతే యాడ్ షూటింగ్ అన్నట్లుగా ఉంది కొంతమంది తారల బిజీ షెడ్యూల్. రెండు చోట్లా మంచి డబ్బు వస్తుండడంతో మరింత హుషారుగా పని చేస్తున్నారు. ఒక సినిమా కోసం మూడు, నాలుగు నెలలు కష్టపడితే వచ్చే పారితోషికం కంటే ఒక నిముషం పాటు కనిపించే యాడ్ ఫిల్మ్ సంపాదనే ఎక్కువగా ఉండడంతో తెలుగులోనూ చాలా మంది తారలు ఇప్పుడు యాడ్ ఫిల్మ్‌లో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అందరి కంటే ఒక అడుగు ముందుకు వేసి యాభై సెకన్ల యాడ్ ఫిల్మ్‌లో నటించినందుకు అక్షరాలా రూ. ఐదు కోట్లు వసూలు చేసి వార్తల్లో నిలిచారు నయనతార. ఇంతకుముందు నయనతార పారితోషికం రూ. ఐదు కోట్లే ఉండేది. కానీ హిందీ చిత్రం 'జవాన్' సూపర్ హిట్ అయిన తర్వాత అమాంతం తన పారితోషికాన్ని పది కోట్ల రూపాయలకు నయనతార పెంచేసిందని నిర్మాతలు చెబుతున్నారు. అంటే సౌత్‌లో నే అత్యధిక పారితోషికం తీసుకొనే హీరోయిన్ నయనతారే అన్నమాట. ఇప్పుడు యాడ్ ఫిల్మ్ తోనూ ఆమె మోత మోగిస్తోంది. ప్రస్తుతం నయనతార తన భర్త విఘ్నేశ్, కవల పిల్లలతో గ్రీస్‌లో జాలీగా విహరిస్తోంది.

అక్టోబర్‌లో గ్యాంగ్‌స్టర్



మాఫియా ముఠాల మధ్య ఆధిపత్య పోరును సరికొత్తగా వెండితెరపై ఆవిష్కరించిన పలు చిత్రాలు విజయం అందుకున్నాయి. ఇప్పుడు ఇదే తరహా కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్ జంటగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ రాథోడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 25న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా రచయిత సాయిమాధవ్ బుర్రా చేతుల మీదుగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకలను ఆకట్టుకునేలా ఉంటుందనీ, కథలోని మలుపులు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని చంద్రశేఖర్ రాథోడ్ తెలిపారు.

అప్‌డేట్స్

మా మనవడినీ ఆదరించండి

- పరుచూరి బ్రదర్స్




సుదర్శన్ పరుచూరి హీరోగా పరిచమయవుతున్న 'మిస్టర్ సెలబ్రిటీ' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు నిర్మించారు. వరలక్ష్మి శరత్‌కుమార్, నాజర్, రఘుబాబు ఇతర ముఖ్య పాత్రధారులు. ఈ సినిమా రిలీజ్ పోస్టర్‌ను పరుచూరి గోపాలకృష్ణ విడుదల చేసి 'మమ్మల్ని ఆదరించినట్లుగానే మా మనవడు సుదర్శన్‌ను ఆదరించాలని కోరుతున్నా. కొత్త దర్శకుడైనా రవికిశోర్ సినిమా బాగా తీశాడు' అని అభినందించారు. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'మమ్మల్ని నలభై ఏళ్లుగా ఆదరిస్తున్నారు. మా మనవడు సుదర్శన్ 'మిస్టర్ సెలబ్రిటీ' హీరోగా మీ ముందుకు వస్తున్నాడు. తనని ఆశీర్వదించి, సినిమాను హిట్ చేయండి' అని కోరారు.

మాస్ లుక్‌తో



యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్‌రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'పొట్టేల్'. దసరాకు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నటుడు అజయ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఆయన లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. మాస్ లుక్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించారు అజయ్. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కె, సురేశ్ కుమార్ సడిగె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతం: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ: మోనిష్ భూపతి రాజు



ఆంధ్ర వర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి సెల్ఫ్ సపోర్టెడ్ కోర్సులు. ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ సహకారంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 40 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.55,000.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో క్రిటికల్ కేర్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 15 చొప్పున మొత్తం 45 సీట్లు ఉన్నాయి. గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్ ఎంచుకున్నవారికి ప్రోగ్రామ్ ఫీజు రూ.40,000. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ప్రోగ్రామ్ ఫీజు రూ.60,000.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ/బీఎస్సీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వయసు:** దరఖాస్తు నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 16
- **క్యాంపస్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్ కిమ్స్-ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్, షీలానగర్, విశాఖపట్నం-532003
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం - 530003
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

దిక్సూచి

ఐఐఎఫ్‌టీలో పీజీ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్(ఇంటర్నేషనల్ బిజినెస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి ఏడాది. ఇది వీకెండ్ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రతి ట్రైమెస్టర్ ప్రారంభంలో మూడు రోజులు కాంటాక్ట్ వీక్ నిర్వహిస్తారు. రెండో ట్రైమెస్టర్‌లో పోర్ట్ విజిట్ ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాలవారికి 45 శాతం మార్కులు చాలు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనుకూలంగా ఉంటుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **వెబ్‌సైట్:** www.iift.ac.in



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు

స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు సహకరించాలి

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 26: స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు ప్రజలు సహకరించాలని పట్టణ పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. సాలిపేటలోని 18వ, 19వ వార్డులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన స్వచ్ఛత హీ సేవ 2024లో భాగంగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులతో స్వచ్ఛత హీ సేవ అవగాహన ర్యాలీని నిర్వహించి, విద్యార్థులతో కలసి స్వచ్ఛత ప్రతిజ్ఞను చేశారు. అనంతరం 29వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బండి శేషన్న, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ ఎలెన్ నిర్మల, మున్సిపల్ అధికారులు, ఇండోర్ అవుట్‌డోర్ సిబ్బంది, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.



వార్డు సభను నిర్వహిస్తున్న అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు, టీడీపీ కౌన్సిలర్ అరుణ తదితరులు

డ్రెయిన్‌ల సమస్యలను పరిష్కరిస్తాం

● అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 26: పట్టణంలో పలు వార్డులలో ఉన్న డ్రెయిన్‌ల సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. గురువారం పట్టణంలోని 28, 29, 30, 31, 32, 33, 34వ వార్డులలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా వార్డు సభలను ఆ వార్డు సచివాలయాలలో మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు అధికారులు, నాయకులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా 30, 32వ వార్డులో సాయంత్రం ఆరు గంటలు దాటితే మందుబాబుల అల్లర్లు ఎక్కువయ్యాని, తాగిన మందు బాటిల్స్‌ను ఖాళీ స్థలాల్లో విసురుతున్నారని, వీధి దీపాలను పగులకొడుతున్నారని, పాదచారులకు ఇబ్బందులు కల్గిస్తున్నారని ఫిర్యాదుచేశారు. ఈ సమస్యపై పోలీసు అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతి రావు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేఎంజేలో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 26: స్థానిక చెంచుపేటలోని జేఎంజే కళాశాలలో గురువారం ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ పాల్గొన్నారు. పర్యావరణ ఆరోగ్యానికి సంబంధించిన వివిధ సమస్యలపై షైనీ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణ సుజాత, విశ్రాంతమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

అనధికార ఫ్లెక్సీలను తొలగించండి: కమిషనర్

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 26: పట్టణంలో ఏర్పాటుచేసిన అనధికార ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ వారు సమీక్షా సమావేశంలో జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి పట్టణంలో ముఖ్య ప్రదేశాలలో, ప్రధాన కూడళ్లలో, సెంటర్ డివైడర్లు, అన్ని ప్రభుత్వ భవనాలపై ఫ్లెక్సీలు, బేనర్ల ఏర్పాటును నిషేధించారని మున్సిపల్ కమిషనర్ శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ భవనాలు, సెంటర్ డివైడర్లలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని లేకుంటే పురపాలక సంఘ సిబ్బంది తొలగిస్తారని తెలిపారు.



అంగలకుదురులో దెబ్బతిన్న నిమ్మతోటల వివరాలను అధికారులకు తెలియజేస్తున్న ఉపసర్పంచ్ నాగభూషణం

నష్టపోయిన నిమ్మ రైతులను ఆదుకోండి

● అధికారులను కోరిన ఉపసర్పంచ్ నాగభూషణం

తెనాలిరూరల్, సెప్టెంబరు 26: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అంగలకుదురులో నిమ్మతోటలు దెబ్బతిని ప్రభుత్వసాయం కోసం ఎదురుచూస్తున్న రైతులను ఆదుకోవాలని ఆ గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం అధికారులను కోరారు. గ్రామంలో దెబ్బతిన్న నిమ్మతోటలను పరిశీలించేందుకు వచ్చిన హార్టీకల్చర్ అధికారులకు ఉపసర్పంచ్ నాగభూణం తోటలను చూపించి రైతుల సమస్యలను వివరించారు. భారీ వర్షానికి నిమ్మతోటల్లో రోజుల తరబడి నీరు నిలిచి చెట్టు నేలవాలి రైతులకు నష్టం మిగిల్చిందన్నారు. అధికసంఖ్యలో సన్న, చిన్నకారు రైతులే నిమ్మసాగు చేపడుతున్నారని తెలిపారు. పడిపోయిన మొక్కల స్థానంలో తిరిగి నాటితే అవి కాపుకు వచ్చేందుకు దాదాపుగా 4 సంవత్సరాలు వ్యవధి పడుతుందన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారిని ఆదుకునేలా చూడాలని హార్టికల్చర్ అధికారి ఉషారాణిని కోరారు. ఆమె స్పందించి పూర్తి వివరాలు నమోదు చేసుకుంటున్నామని దీనిపై గ్రామసభ నిర్వహించి వారికి మంచి జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అసిస్టెంట్ హార్టికల్చర్ అధికారి రోస్ కిరణ్, రైతులు ఉన్నవ శేషుబాబు, నరేంద్ర, వెలగా ఆదినారాయణ, అర్జు, పాపోలు శ్రీను, కనగాల రామకృష్ణ, కడియాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులతో అధ్యాపకులు

ఏఎస్ఎన్‌లో ఔషధ నిపుణుల దినోత్సవం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26: ఆరోగ్య రంగంలో ఫార్మసిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని డాక్టర్ వి.కోటిరెడ్డి చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో గురువారం ఔషధ నిపుణుల దినోత్సవం నిర్వహించారు. గ్లోబల్ హెల్త్ అనే అంశంపై ఆయన మాట్లాడుతూ, వైద్యులు రోగులకు ప్రాణాలు పోస్తే, ఆ వైద్యానికి అమృతం అందించే వారు ఫార్మసిస్టులని చెప్పారు. విద్యార్థులకు పోస్టర్ కేస్ ప్రజంటేషన్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ కె.వెంకటరమణ, గోపాలకృష్ణ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

28న యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభ

చేబ్రోలు, సెప్టెంబరు 26: ఈ నెల 28వ తేదీన చేబ్రోలు మండల యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ నిర్వహిచినట్లు ఆ సంస్థ మండల అధ్యక్షుడు వై.రమేష్ బాబు తెలిపారు. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. మహాసభకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా రానున్నట్లు తెలిపారు. సభలో 18మంది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బి.నాగేశ్వర రావు, హనుమంతరావు, ఎం.కళాధర్, పి.ఆదిలక్ష్మి, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో లోతట్టు ప్రాంత వాసుల అవస్థలు



రవి కుమార్ కాలనీలో గృహాల్లోకి చేరిన వర్షపు నీరు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 26: పట్టణంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతవాసులు తీవ్రంగా అస్థలకు గురవతున్నారు. రాత్రివేళ భారీ వర్షం కురియటంతో వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేక పల్లపు ప్రాంతాలలో ఉన్న జనావాసాలను ముంచెత్తుతున్నాయి. ఇటీవల నిడుబ్రోలు ఎరుకులవాడలో పదుల సంఖ్యలో గృహాల్లోకి వర్షపు నీరు చేరి ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా పట్టణంలోని నిడుబ్రోలు రవికుమార్ కాలనీలోకి భారీగా వర్షపునీరు చేరి గృహాల్లోకి నీరు చేరింది. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్న పూరిల్లు ఉన్న వారు వాన నీటిలోనే జీవనం సాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సమీపంలోనే సచివాలయం లోపలికి సచివాలయ సిబ్బంది ప్రజల కష్టాలు తీర్చేందుకు చొరవచూపటం లేదు, స్థానికులు నీటిని మళ్లించాలని సచివాలయ అధికారులు పలుమార్లు మొరపెట్టుకున్నప్పటికి, చూసి వెళ్లుతున్నారే కాని సమస్యలు పరిష్కరించటం లేదని స్థానికులు వాపోతున్నారు. వాన నీటిలోనే జీవనం కొనసాగిస్తే పారిశుధ్య సమస్యలు తలెత్తి ఆరోగ్యం దెబ్బతింటుందని స్థానికులు వాపోతున్నారు. జనావాసాల మధ్య రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో నీటిలో దోమలు వృద్ధిచెంది విష జ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పురపాలక సంఘం అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించటమే లక్ష్యం

● కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 26: పురపాలక సంఘంలోని ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించటమే ప్రధాన లక్ష్యం అని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని నిడుబ్రోలులోని వార్డులో కమిషర్ పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో కుళాయి ద్వారా విడుదలైన నీటిని స్వయంగా తాగి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తాగునీరు పరిశుభ్రతపై ఎటువంటి ఫిర్యాదులు రాకుండా ముందు జాగ్రత చర్యలు పాటిస్తున్నట్లు చెప్పారు. పలు ప్రాంతాల్లో నీటి శాంపిల్స్ సేకరించి నీటి నాణ్యతను పరిశీలిస్తున్నామన్నారు. కుళాయిల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా, శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.



నిడుబ్రోలులో తాగు నీటిని పరీక్షిస్తున్న కమిషనర్ రమేష్ బాబు

కార్యక్రమంలో స్థానికులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ

● అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు



ఐలమ్మ విగ్రహం వద్ద అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, తదితరులు

తెనాలి రూరల్, సెప్టెంబరు 26: వీరనారిగా మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ వల్లూరి లక్ష్మీపతిరావు అన్నారు. గురువారం చాకలి (చిట్యాల) ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని రజకపార్క్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఐలమ్మ చేసిన పోరాటాలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో మునిపల్లి ప్రసాదరావు, బి.హిమాలయరావు, నెప్పల్లి రాంబాబు, డి.బాలయ్య, ఎస్.సుబ్రహ్మణ్యం, సీహెచ్ వాసు, డి.శ్రీను, ఎస్.మస్తాన్, కె.ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఆదినారాయణ, వీరభద్రరావు, గోవర్ధనరావు, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల నివాళి

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 26: పట్టణ పరిసర ప్రాంతాలలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక రజకపేటలోని చాకలి ఐలమ్మ మున్సిపల్ పార్క్‌లో గురువారం ఐలమ్మ విగ్రహం వద్ద చాకలి ఐలమ్మ 129వ జయంతి ఉత్సవాలను టీడీపీ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పణిదపు దుర్గ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పెత్తందారుల సాయుధ పోరాటంలో అణగారిన ప్రజల పక్షాన పోరాడిన చిట్యాల ఐలమ్మ చిరస్మరణీయురాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, టీడీపీ కౌన్సిలర్‌లు పసుపులేటి త్రిమూర్తి, బ్రహ్మేశ్వరావు, చాట్రగడ్డ ఆంజనేయులు, కావేటి వేణు, కొడాలి సుబ్రహ్మణ్యం, మునిపల్లి రామకృష్ణ, విజయ్, శ్రీను, నరసింహ, కృష్ణ, శివశంకర్, పూర్ణ, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో...

స్థానిక రజకపేటలోని రజక చెరువు వద్ద ఉన్న మున్సిపల్ పార్కులోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద చాకలి ఐలమ్మ జయంతిని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భూస్వాములకు ఎదురొడ్డి నిలిచిన వీరనారి అన్నారు. భూమికోసం, భుక్తికోసం భూస్వాముల దోపిడీని ఎదిరించి వారిని గడగడలాడించిన వీర మహిళ ఐలమ్మ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా యూనివర్సిటీకి చిట్యాల ఐలమ్మ పేరు పెట్టి గుర్తింపునిచ్చిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐలమ్మ పోరాట స్ఫూర్తిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునివ్వాలని కోరారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరావు, కుర్రా శ్రీను, పోతరాజు, శివ, రవిశంకర్, అన్నం గణపతి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

తెనాలి క్రైం, సెప్టెంబరు 26: ఇంటి సమీపంలోని షాపుకు వెళ్లి వస్తుండగా మహిళ మెడలోని బంగారు గొలుసు అగంతకుడు లాక్కునివెళ్లిన సంఘటన పట్టణంలోని ముత్తింశెట్టిపాలెంలో బుధవారం రాత్రి జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాచాభక్తుని శివకుమారి బుధవారం రాత్రి7.30 సమయంలో ముత్తింశెట్టిపాలెంలోని పద్మావతి కల్యాణ మండపం సమీపంలో షాపు నుంచి పాల ప్యాకెట్ తీసుకుని ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన అగంతకుడు ఆమె మెడలోని రూ.72వేల విలువైన 24గ్రాముల బంగారు గొలుసు లాక్కొని వెళ్లాడు. పద్మావతి కల్యాణ మండపం సందులో నుంచి వెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

27న గుర్రం జాషువా పురస్కార సభ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 26: ఈ నెల 27వ తేదీన గుంటూరు బ్రాడీపేటలో జాషువా విజ్ఞాన కేంద్రంలో గుర్రం జాషువా పురస్కార ప్రదాన సభ జరగనున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు తెలిపారు. గురువారం సభ కరపత్రాలను ఆవిష్కరించారు. గుర్రం జాషువా పురస్కార ప్రదానోత్సవ సభకు కవులు, కళాకారులు సాహితివేత్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.వాసుబాబు, కట్టుపల్లి వసంత్ కుమార్, లక్ష్మీనారాయణ, జి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'స్వర్ణాంధ్ర 2047'పై అభిప్రాయ సేకరణ

పెదకాకాని, సెప్టెంబరు 26: వికసిత భారత్ 2047లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూపొందించిన 'స్వర్ణాంధ్ర 2047' విజన్ ప్రణాళికాపై అభిప్రాయాలు సేకరణ కార్యక్రమం వీవీఐటీ కళాశాలలో గురువారం నిర్వహించారు. 2047 విజన్ సాకారమవ్వాలంటే, వ్యూహాత్మక దృష్టి సారించాల్సిన రంగాలలో విద్య, నైపుణ్యం ఒకటన్నారు. ఈ అంశంపై ఈ నెల 27 నుంచి 29 వరకూ కళాశాలలో పలు పోటీలు నిర్వహించనున్నారు. గుంటూరు జిల్లా ప్రణాళికా విభాగం స్టాటిస్టికల్ అధికారి కె.పోలయ్య కళాశాలలో స్వర్ణాంధ్ర 2047 అభిప్రాయ సేకరణ కరపత్రాలను విడుదల చేసి, ప్రణాళిక గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ సూచనలు అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. అభిప్రాయ సేకరణ అనంతరం విజన్ 2047 స్వర్ణాంధ్ర ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు వివరించారు. స్మార్ట్‌ఫోన్ నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా పాల్గొని ముఖ్యమంత్రి ఫొటో, సంతకంతో కూడిన సర్టిఫికెట్ పొందవచ్చని తెలిపారు. వీవీఐటీ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో కళాశాలకు చెందిన విద్యార్థులు తమ సూచనలు అభిప్రాయాలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, గుంటూరు ప్లానింగ్ డిప్యూటీ ఎస్‌వో శ్రీనివాసరావు, పెదకాకాని రెవెన్యూ సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్ అధికారి భక్తసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారంపై రైతుల్లో హర్షాతిరేకాలు

తెనాలి రూరల్, సెప్టెంబరు 26: కూటమి ప్రభుత్వం పంట నష్టపోయిన వారికి పరిహారాన్ని ఖాతాలో జమచేసి అండగా నిలబడిందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారుగా 7419 ఎకరాల్లో 4160 మంది రైతులు వరి పంటలు సాగు చేపట్టి అకాల వర్షాలకు పంటలు మునిగి నష్టపోయారు. కూటమి ప్రభుత్వం స్పందించి నష్టం వివరాలు వేగవంతంగా నమోదు చేసి రైతులకు ధైర్యం చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేతికొచ్చిన పంటలు అకాల వర్షాలకు దెబ్బతిన్నా నష్టపరిహారం ఉండేది కాదని, కూటమి ప్రభుత్వం అన్న మాట ప్రకారం రైతుల ఖాతాల్లో నష్టపోయిన వరి పంటకు ఎకరాకు రూ.10వేలు వంతున, పదిరోజుల్లోనే ఎకరాకు రూ.10వేలు వంతున వారి ఖాతాల్లో నగదు చేయడంపై రైతులు హర్షాతిరేకాలు వెలిబుచ్చారు.

మందిర నిర్మాణం ఆపాలంటూ దాడి

తెనాలి రూరల్, సెప్టెంబరు 26: నాజరుపేట వద్ద శిథిలావస్థలో ఉన్న శ్రీకృష్ణుని మందిరం స్థానంలో నూతన మందిర నిర్మాణ పనులు వివాదాస్పదమైంది. బాధితుడు సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నాజరుపేటలోని శ్రీకృష్ణభగవానుని మందిరం శిథిలావస్థకు చేరింది. దీంతో నూతన మందిరం నిర్మించేందుకు పనులు చేపట్టగా అదే ప్రాంతానికి చెందిన కొందరు నిర్మాణ పనులు ఆపాలంటూ తనతో ఘర్షణకు దిగి, కత్తులతో దాడిచేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సుబ్బారావును స్థానికులు, కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వవైద్యశాలకు తరలించించి చికిత్స అందించారు.

ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు నష్ట పరిహారం

● ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 26: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించారని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఇటీవల కురిసన భారీ వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా హెక్టార్‌కు రూ.25వేల ఆర్థిక పరిహారం అందించినట్లు చెప్పారు. ప్రతి రైతు ఖాతాలో ఎకరానికి రూ. 10వేలు అందచేసి ఆదుకున్నారన్నారు. పొన్నూరు మండలంలో 8400 ఎకరాలో 5026 మంది రైతులు పంట నష్టపోగా వారి ఖాతాలో రూ.8.20 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల తరపున ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు, సొపాటి వెంకట్రావు, బుడ్డ బీరయ్య, నిమ్మగడ్డ వెంకట ధర్మారావు, తోట రాధకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంగం సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 26: సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని కసుకర్రు, పాల సొసైటీలో గురువారం 74 మంది పాల రైతులకు రూ.1,28,697, యలవర్తి మురళీకృష్ణ పాయింట్‌లో 12మంది రైతులకు రూ.20,714 బోనస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తునట్లు చెప్పారు. డీవీసీ అభయ పథకం ద్వారా పాడి పశువులకు బీమా సౌకర్యం కల్పించటంతోపాటు పాల రైతులకు కూడా బీమా సౌకర్యం అందిస్తునట్లు చెప్పారు. సంగం లాభాలను బోనస్ రూపంలో రైతులకే తిరిగి అందిస్తునట్లు చెప్పారు. కార్యక్రమంలో అప్పికట్ల చిల్లింగ్ సెంటర్ మేనేజర్ కాట్ర నరేష్‌బాబు, ఫీల్డ్ సూపర్‌వైజర్ వి.గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వీరరాఘవాచార్యుల జయంతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26: నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో సాహిత్యవేత్త పొందూరు వీరరాఘవాచార్యులు జయంతి గురువారం నిర్వహించారు. అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షతన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వ బ్రాహ్మణ పురోహిత సంఘ అధ్యక్షుడు గోవర్ధనాచార్యులు మాట్లాడుతూ, శిల్ప సాహిత్యంలో ఎనలేని ఖ్యాతి గడించారని చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన చిత్రకారుడు పావులూరి చిదంబరేశ్వరరావు దంపతులను సన్మానించారు. పీఎల్‌వీ అప్పారావు, పి.శ్రీనివాసరావు, శోభాదేవి, స్వరాజ్యలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

నష్టపోయిన రైతులకు బ్యాంకు రుణాలు రద్దు చేయాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

కొల్లిపర, సెప్టెంబరు 26: కృష్ణానది వరదల కారణంగా రైతులు భారీగా నష్టపోయారని బ్యాంకు రుణాలు రద్దుచేసి వారిని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రైతు సంఘ నాయకులు మహిళా రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన పంట నష్టపరిహారం చాలా తక్కువగా ఉందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20వేలను సాయం చేయాలన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. పొలాల్లో మేటవేసిన ఇసుకను తొలగించి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాస్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామంలా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

● మండల కో-ఆర్డినేటర్ వెంకటరెడ్డి

కొల్లిపర, సెప్టెంబరు 26: ప్రతి గ్రామాన్ని స్వచ్ఛత గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మండల కో-ఆర్డినేటర్ మర్రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చివలూరులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. మండలంలోని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కలిగించారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 26: ముఠా కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేసారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద బియ్యం తరలించే హమాలీల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బియ్యం గోదాముల వద్ద పనిచేస్తున్న ముఠా కార్మికులకు ఈఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్ లేకపోవటం సరికాదన్నారు. 58 సంవత్సరాలు నిండి పది సంవత్సరాలు పూర్తయిన వారికి కూడా పింఛను రావటం లేదని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖలో అధికారులు కార్మికుల సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. అగ్రిమెంట్ ప్రకారం కూలీ రేట్ల పెంపు 2024 జనవరి నుంచి అమలు చేయాల్సివుండగా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు పులుగు విద్యాసాగర్, వల్లూరు మధు, తూమాటి రాజు, చిలుమూరి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ ఎస్‌గా శ్రీహరి బాధ్యతల స్వీకారం



అర్బన్ ఎస్ఐ శ్రీహరి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 26: పొన్నూరు అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా శ్రీహరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న శ్రీహరి పొన్నూరు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ రాజ్‌కుమార్ నెల్లూరు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శ్రీహరిని సహచర సిబ్బందిని అభినందించారు.

ఆకతాయిల వేధింపులపై మహిళల ఫిర్యాదు

తెనాలి క్రైం, సెప్టెంబరు 26: స్థానిక ముత్తింశెట్టిపాలెంలో మహిళలపై ఆకతాయిల వేధింపులు ఎక్కువయ్యాయని ఆ ప్రాంత మహిళలు వన్ టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఇక్కడి రైల్వే ట్రాక్ సమీపంలో గుడిసెలలో నివాసం ఉండే మహిళలు పగలు పట్టణంలో రోడ్ల వెంట కాయలు, పూలు అమ్ముకుని జీవనం సాగిస్తుంటారు. ఒంటరి మహిళలను, వారి ఆర్థికలేమిని ఆసరాగా చేసుకుని కొందరు ఆకతాయిలు ఇండ్లలో ప్రవేశించి వేధింపులకు గురిచేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానిక గిరిజన మహిళలు ఫిర్యాదులో కోరారు.